క్లుప్తంగా

శాకంబరీదేవిగా కన్యకా పరమేశ్వరి

వాల్మీకిపురం : స్థానిక బజారువీధిలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు శుక్రవారం ఆషాడ మాసం సందర్భంగా శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, జలాభిషేకం, కుంకుమార్చన, తదితర అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని ముస్తాబు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు.

కోర్టు గంగమ్మ..
మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం కోర్టు ఆవరణంలో వెలసిన గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాకంబరీదేవి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారిని ఆకు కూరలు, కాయగూరల దండలతో అలంకరించారు. మహిళలు ఆలయం ఎదుట నిమ్మకాయలతో నెయ్యి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

బ్యాంకు రుణాలు సకాలంలో రికవరీ చేయాలి

రామసముద్రం: మహిళా సంఘాల నుంచి బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పీడీ సత్యనారాయణ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఐకేపీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మహిళా సంఘాలను సంక్రమంగా నడపాలని, విధులు సక్రమంగా నిర్వర్తించని సంఘమిత్రాలకు జీతాలు పెండింగ్‌లో పెట్టాలని సూచించారు. రుణాల రికవరీలో రామసముద్రం వెనుకబడిందన్నారు. మహిళా సంఘాలకు విరివిగా రుణాలు ఇప్పించి తిరిగి చెల్లించేలా దృష్టి సారించాలన్నారు. ఏపీఎం సుబ్రమణ్యం, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

బీసీజీ టీకాపై అవగాహన

వాల్మీకిపురం : క్షయవ్యాధిలేని సమాజం కోసం బీసీజీ టీకాలను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ అన్నారు. శుక్రవారం స్థానిక జామియా మసీద్‌లో ముస్లిం సోదరులకు బీసీజీ టీకాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమ, గురువారాల్లో అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అర్హులైన ఆరు వర్గాల వారికి బీసీజీ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. అనంతరం బీసీజీ టీకాలు వేశారు. టీబీయూనిట్ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ

మదనపల్లె సిటీ : బ్యాంక్ ఆఫ్ బరోడా 117 వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక అమ్మచెరువుమిట్ట వద్దనున్న అక్షరధాత్రి స్టడీసెంటర్లలోని విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. విద్యార్థులకు కావాల్సిన నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ప్యాడ్స్ తదితర వస్తువులు అందించారు. అలాగే ఆనందనిలయంలోని వృద్ధులకు బెడ్‌షీట్స్ అందజేశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని బ్యాంకు మేనేజర్ అనిల్ కుమార్ సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ మోహన్, ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు స్వాతి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం

పీలేరు రూరల్ : వ్యవసాయానికి, గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని తిరుపతి, చిత్తూరు ట్రాన్స్‌కో డిప్యూటీ ఈఈలు కె.బాబు, సతీష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో పీలేరు డివిజన్‌లో 33/11కేవీ సబ్‌స్టేషన్‌లలో పని చేస్తున్న సిబ్బంది ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. విద్యుత్ సరఫరా ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు, వినియోగ దారుల నుంచి ఫిర్యాదులు అందినచలో సానుకూలంగా స్పందించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీలేరు, కలికిరి ఏడీఈలు సుధాకర్, శివయ్య, శ్రీనివాసులు, ఏఈలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

కలకడ : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని పాపిరెడ్డిగారిపల్లె గ్రామాలలో పర్యటించి సీజనల్ వ్యాధులు, విషజ్వరాలపై గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకోవాలని సూచించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ప్రతి సోమవారం, గురువారం అన్ని ఆరోగ్య కేంద్రాలలో బీసీజీ టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయుడు లేక విద్యార్థుల అవస్థలు

వాల్మీకిపురం : మండలంలోని ఆరమడక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడు లేక విద్యార్థులు గత తొమ్మిది రోజులు అవస్థలు పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. విద్యార్థులు ఆరు బయట కూర్చొని, ఉపాధ్యాయుల కోసం పడిగాపులు పడి నిరాతో ఇళ్లు చేరుతున్నారు. తమ పిల్లలకు చదువు చెప్పేవాళ్లు లేక, మధ్యాహ్న భోజనం లేక విద్యార్థుల అవస్థలు వర్ణణాతీతం. ఉన్న విద్యార్థులు కూడా ఉపాధ్యాయులు లేక స్కూల్ ఎక్కడ మూతపడుతుందో అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గ్రామ సింహాలతో జనం గజగజ

రోజురోజుకు పెరిగిపోతున్న కుక్కల బెడదతో జనం హడలెత్తిపోతున్నారు. వీధుల్లో తిరగాలంటే ప్రజలు జంకుతున్నారు. రాత్రుళ్లు ఇండ్లకు చేరుకోవాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనదారులకూ కష్టాలు తప్పడం లేదు. నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు వెంట పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. మదనపల్లె మున్సిపల్ అధికారులు కుక్కల నియంత్రణపై దృష్టి పెట్టకపోవడంతో వాటి సంతంతి విపరీతంగా పెరుగుతోంది. కుక్క పిక్క పీకితే లబోదిబో మంటూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల నుంచి రక్షించాలని వేడుకుంటున్నారు పురప్రజలు.


మదనపల్లె ప్రశాంత్‌నగర్‌లో గుంపులుగా సంచరిస్తున్న వీధికుక్కలు

- స్థానికులపై తరుచూ దాడులు
- ప్రతి నెలా 20 కేసులు
- అధికారులు స్పందించాలని ప్రజల వేడుకోలు

మదనపల్లె సిటీ : మదనపల్లె మున్సిపాలిటీలో కుక్కల దాడిలో గాయపడిన బాధితుల సంఖ్య పెరుగుతోంది. ప్రతి నెలా సుమారు 20 వరకు కేసులు నమోదవుతున్నాయి. రోడ్డుపైకి వెళ్లే క్షేమంగా తిరిగి ఇంటికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ముఖ్యంగా చిన్నపిల్లలు వీటి బారిన పడి ఆస్పత్రి పాలవుతున్నారు. వీటిని నియంత్రించడానికి మున్సిపాలిటీ చేపట్టిన చర్యలు పూర్తి స్థాయిలో ఫలితం ఇవ్వలేదని ఆరోపణలున్నాయి.

నిరుపయోగంగా శునకాల జనన నియంత్రణ కేంద్రం
స్థానిక బైపాస్‌రోడ్డులోని మున్సిపాలిటీ కంపోస్టు యార్డు వద్ద శునకాల జనన నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 2016లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందు కోసం రూ.22 లక్షలు ఖర్చు చేశారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ చేసి పిల్లలు పుట్టకుండా చర్యలు చేపట్టారు. మదనపల్లె మున్సిపాలిటీలో సుమారులో 5 వేలకుపైగా కుక్కలు ఉన్నట్లు అంచనా. జనన నియంత్రణ కేంద్రం ప్రారంభంలో సజావుగా శస్త్ర చికిత్సలు జరిగినా తర్వాత ఆగిపోయాయి. ప్రస్తుతం ఈ కేంద్రం మూతపడిపోయింది. దీంతో కుక్కల సంతతి పెరిగిపోయింది.

వీధుల్లో ఎక్కడ చూసినా కుక్కల గుంపులే..
మున్సిపాలిటీ పరిధిలో వీధుల్లో ఎక్కడ చూసినా కుక్కల గుంపులే కనిపిస్తున్నాయి. పాదాచారులతో పాటు వాహనాలపై వెళ్లే వారిపై దాడులు చేస్తున్నాయి. రోజు రోజుకు కుక్కల బెడద ఎక్కువై పోతున్నట్లు ప్రజలు వాపోతున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మాంసాహార వ్యర్థాలు
బహిరంగ ప్రదేశాల్లో మాంసాహార వ్యర్థాలను దుకాణదారులు, హోటళ్ల యజమానులు వేయడం వలన కుక్కల బెడద ఎక్కువైంది. వ్యర్థాల కోసం గుంపులు, గుంపులుగా కుక్కలు తెగబడుతున్నాయి. దీంతో దారిన పోయే వారిపై దాడులకు దిగుతున్నాయి. వర్షాకాలంలో చర్మవ్యాధుల బాధలతోనూ తట్టుకోలేక వీధికుక్కలు పిచ్చిపట్టినట్లు కరుస్తున్నాయి.

పేరుకే స్పెషల్ డ్రైవ్
పత్రికల్లో వార్తలు వస్తే తప్ప మున్సిపాలిటీ స్పందించరు. స్పెషల్ డ్రైవ్ పేరుతో నాలుగైదు రోజులు చేపడతారు. తర్వాత వీటి గురించి పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

నెలకు 20కి పైగా కేసులు
మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో నెలకు సరాసరి 20 కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. దీంతో పాటు మదనపల్లె రూరల్ మండలానికి నుంచి కూడా కేసులు వస్తున్నాయి. బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది.

పిల్లలు, పెద్దలపై దాడి చేస్తున్నాయి



పట్టణంలో కుక్కల బెడద అరికట్టాలి. ఇటీవల వీధుల్లో వీధి కుక్కలు స్వైర్య విహారం చేస్తున్నాయి. పిల్లలు, పెద్దలపై పడి కాట్లు వేస్తున్నాయి. కుక్కల గురించి మున్సిపాలిటీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. వీటిని పట్టి కు.ని ఆపరేషన్లు చేయాలని పలుసార్లు మున్సిపల్ అధికారులకు చెప్పినా స్పందించలేదు.
- గౌరిశంకర్‌రెడ్డి, అమ్మచెరువుమిట్ట, మదనపల్లె

కుక్కల బెడద లేకుండా చర్యలు



పట్టణంలో కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకుంటాం. ఇటీవల కుక్కల సంతతి పెరిగినట్లు ఫిర్యాదులు అందాయి. ఇందు కోసం బర్త్ కేర్ ద్వారా అనిమల్ కేర్ సంస్థ ద్వారా గుర్తించిన కుక్కలకు బర్త్ కంట్రోల్ వ్యాక్సిన్, యాంటీ రాబిస్ వ్యాక్సిన్‌లు వేస్తాం.
-ప్రమీల, మున్సిపల్ కమిషనర్, మదనపల్లె

కురబలకోట టీడీపీలో విభేదాలు

- మండల మీట్‌లో అభాసుపాలు
- ఎట్టకేలకు మండల మీట్ వాయిదా


మండల మీట్‌లో టీడీపీ నాయకుల వాగ్వాదం

కురబలకోట : మండల టీడీపీలో విభేదాలు భగ్గుమన్నాయి. మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో శుక్రవారం జరగాల్సిన మండల మీట్ టీడీపీ కుమ్ములాటలకు, గ్రూపు రాజకీయాలకు వేదికగా మారింది. వీరి నిర్వాకం చూసి మండల మీట్‌కు హాజరైన అధికార, ఉద్యోగ యంత్రాంగం నివ్వెరపోయారు. ఒకే పార్టీకి చెందిన వారు పరస్పరం విమర్శలకు, వాదులాటకు దిగడంతో చూపరులు నోటిమీద వేలేసుకున్నారు. మండల మీట్‌ను అడ్డుకోవాలని మండల టీడీపీ, బీజేపీ, జనసేన మెజారిటీ నాయకులు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. మరో వైపు సమావేశపు హాల్‌లో ఆపార్టీకి చెందిన ముదివేడు ఎంపీటీసీ వైజి సురేంద్ర వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలతో కలసి సమావేశం నిర్వహించడానికి అధ్యక్ష స్థానంలో కూర్చుకున్నారు. ఇది తెలుసుకుని టీడీపీ శ్రేణులు, నాయకులు ఒక్కసారిగా మండల మీట్ సమావేశపు హాల్‌లోకి వెళ్లి అతన్ని నిలదీశారు. పార్టీతో చర్చించకుండా సమావేశంలో ఎలా కూర్చుంటావని విరుచుకుపడ్డారు. అతనిపై నిప్పులు చెరిగారు. మీటింగ్‌లో నుంచి లేవాలని నిలదీశారు. చేసేది లేక చివరకు వైజి సురేంద్ర మీటింగ్ హాల్ నుంచి బయటకు వచ్చారు. దీంతో కోరం లేక మండల మీట్ వాయిదా పడినట్లు ఎంపీడీఓ హరినారాయణ ప్రకటించడంతో టీడీపీ శ్రేణులు, కూటమి నాయకులు అక్కడి నుండి వెనుదిరిగారు. తిరిగి మండల మీట్ ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామని ఎంపీడీఓ తెలిపారు. కురబలకోట మండల మీట్ వాయిదా పడటం ఇది రెండోసారి కావడం విశేషం.


ప్రతిపక్షాలపై దాడి హేయమైన చర్య

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



వాల్మీకిపురం : ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలపై దాడులు చేయడం హేయమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్పలపై టీడీపీ నాయకులు దాడులు చేయడం సమంజసంకాదన్నారు. కూటమి ప్రభు త్వం కక్షిపూరిత రాజకీయాలే అజెండాగా పని చేస్తోందన్నారు. అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు ఉసిగొల్పడం దారుణమన్నారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదని, రాష్ట్రంలో ఇలాంటి హింసాత్మక ఘటనలు గతంలో ఎప్పుడూ చూడలేదన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం నిర్వీర్యం కాకుండా చూసే బాధ్యత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులదేనన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ఓ ఎంపికే రక్షణ కల్పించలేని ఈ ప్రభుత్వం సామాన్యులను ఎలా కాపాడుతుందన్నారు. దాడులకు తగిన మూల్యం చెల్లించుకునే రోజు కచ్చితంగా వస్తుందన్నారు. రాళ్లదాడికి పాల్పడటం, వాహనాలు ధ్వంసం చేయడం తగదని హితవుపలికారు. ప్రశాంతంగా ఉన్న పట్టణాల్లో టీడీపీ నాయకులు ఫ్యాక్షన్ సంస్కృతిని తీసుకు వస్తున్నారని, భవిష్యత్తులో ఇలాంటి చర్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్నేహపూర్వక వాతావరణంలో అందరూ అన్నదమ్ముల్లా కలిసి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పాలబిల్లులు చెల్లించలేదని రైతుల నిరసన


అమూల్ డెయిరీ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

మదనపల్లె : కురబలకోట మండలం గౌనువారిపల్లెకు చెందిన రైతులు మూడునెలలుగా పాలబిల్లులు చెల్లించడం లేదని చిప్పిలి అమూల్ డెయిరీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం డెయిరీ ఎదుట బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అమూల్ డెయిరీ సూపర్‌వైజర్ తమ పాలబిల్లులు కాజేశాడని, దీనిపై తాము ఫిర్యాదుచేస్తే న్యాయం చేయకపోగా తమను ఆఫీసుకు తిప్పించుకుంటూ పాలబిల్లులు నిలిపేశారన్నారు. తమ బిల్లులు చెల్లించేంతవరకు నిరసన విరమించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రైతులతో డెయిరీ మేనేజర్ లక్ష్మీకాంత్ మాట్లాడుతూ అమూల్ డెయిరీకి పాలు పోస్తున్న రైతులకు క్రమం తప్పకుండా బిల్లులు చెల్లింపులు చేస్తున్నామన్నారు. ఇతర ప్రైవేట్ డెయిరీల కంటే అధిక ధర ఇవ్వడమే కాకుండా, మిల్క్ హాలిడే ప్రకటించకుండా, ఎన్ని పాలు వచ్చినా కొనుగోలు చేస్తున్నామన్నారు. సాంకేతిక కారణాలతో రెండు సొసైటీలకు బిల్లుల నిలుపుదల చేశామని, వీలైనంత త్వరలో సమస్య పరిష్కరించి, సాయంత్రానికి బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. దీంతో రైతులు నిరసన విరమించారు.

పెండింగ్ రుణాల వసూళ్లకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

పెద్దతిప్పసముద్రం: స్థానిక స్త్రీ శక్తి భవనంలో శుక్రవారం పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాల్లోని గొర్రెలు, మేకల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘాల సభ్యులకు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏపీఎం శ్రీనివాసులు, జిల్లా మైక్రో ఫైనాన్స్ గ్రూప్ మేనేజర్ (డీఎంజీ)ల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు సంఘ సభ్యులనుద్దేశించి మాట్లాడుతూ ఈ రెండు మండలాల్లో 125 గ్రూపులు ఉన్నా కేవలం 80 గ్రూపుల్లోని సంఘ సభ్యులు మాత్రమే లావాదేవీలు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటి దాకా రూ.70 లక్షల దాకా గ్రూపు సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసినా పలు సంఘాల సభ్యులు రుణాలను తిరిగి బ్యాంకులకు చెల్లించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఈ రెండు మండలాల్లోని కాట్నగల్లు, బడికాయలపల్లి, బద్దిపల్లి, బూచిపల్లి, బెట్టకొండ గ్రామాల్లోని సంఘాల సభ్యులు రూ.26 లక్షల రుణాలు పెండింగ్‌లో నిలచి పోయాయన్నారు. రుణాలను రికవరీ చేసేందుకు కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. అవసరమైతే ఆర్ఆర్ యాక్ట్ ద్వారా నైనా పెండింగ్ రుణాలను రికవరీ చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

పర్యావరణాన్ని కాపాడాలి

ములకలచెరువు : స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో శుక్రవారం సీఐ తమ్మిశెట్టి మధు, ఎస్ఐ తిప్పేస్వామి, పోలీసులు మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలని ప్రజలకు సూచించారు. నేటి మొక్కలు భవిష్యత్తులో వృక్షాలుగా మారి ప్రజలకు ఎంతో మేలు కలిగిస్తాయన్నారు.

మదనపల్లె సిటీ : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆరోగ్యవంతమైన జీవితం కోసం మొక్కల ఆవశ్యకత తెలియజేశారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ది ఆర్ట్ లివింగ్ మాజీ సభ్యులు ఓం ప్రకాష్, సీనియర్ శిక్షకులు క్రాంతి, నారాయణరెడ్డి, రాజేంద్రప్రసాద్, నాగలక్ష్మి,హెచ్ఎం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌లో మార్పులు, చేర్పులకు అవకాశం

కలికిరి: మండల ప్రజల సౌకర్యార్థం ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులకు ఐదు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామక్రిష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు డ్రైవ్ జరుగుతుందని, 23న మంగళవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, మునెళ్ళపల్లి గ్రామ సచివాలయం, 24న ఇందిరమ్మ కాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మర్రికుంటపల్లి గ్రామ సచివాలయంలో డ్రైవ్ నిర్వహిస్తారు. 25న కలికిరి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, పల్లవోలు గ్రామ సచివాలయం, 26న కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుండ్లూరు గ్రామ సచివాలయం, 27న కలికిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల, మహల్ జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ అధికారి అందుబాటులో ఉంటారని తెలిపారు. విద్యార్థులు, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యర్థాల సమస్యను తీర్చండి

గుర్రంకొండ : గుర్రంకొండ మేజర్ పంచాయతీలో నెలకొన్న వ్యర్థపదార్థాల సమస్యను పరిష్కరించాలని బీజేపీ మండలశాఖ అధ్యక్షులు రామాంజులు, కూటమి నాయకులు కలసి ఎస్ఐ నాగార్జున రెడ్డి, పంచాయతీ ఈఓ విశ్వనాథ్‌లకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్, పంచాయతీ కార్యాలయాలకు వెళ్లి వారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని సచివాలయం నుంచి కలకడ క్రాస్ వరకు, స్థానిక మగ్బీరా నుంచి ఎనుగులచెరువు కట్ట వరకు రోడ్డుకిరువైపులా కోళ్ల వ్యర్థాలు, చేపల వ్యర్థాలు వేస్తున్నారన్నారు. దీంతో అటువైపు వెళ్లేవారు దుర్గంధం భరించలేకున్నారని, ప్రయాణికులు, గ్రామస్తులు రాకపోకలుక సాగించలేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో భరత్,చింతిర్ల కిషోర్, రెడ్డిరాజా, బాబు, రామాంజి, రెడ్డిశేఖర్‌లు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

మదనపల్లె : నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు అమరరాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఎస్వీఆర్ కల్యాణ మండపంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అమరరాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యంలో నడుస్తున్న కరకంబాడి, చిత్తూరు ఫ్యాక్టరీల్లో ఉద్యోగాలకు పదోతరగతి పాస్, ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన అభ్యర్థులు అర్హులన్నారు. నిరుద్యోగులు విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు తీసుకుని నేరుగా ఆదివారం ఎస్వీఆర్ కల్యాణమండపంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతపై జేసీ ఆగ్రహం

- మండలంలో విస్తృత తనిఖీలు
- సచివాలయాలూ తనిఖీ
- జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్


కలికిరి బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థినులను విచారిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్

కలికిరి : జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ కలికిరి మండలంలో విస్తృత తనిఖీలు చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను తనిఖీ చేసిన జేసీ మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో బాలికల ఆన్‌లైన్ అటెండెన్స్, మధ్యాహ్న భోజనం సరఫరాలో వ్యత్యాసం ఉండటంతో ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లోపంపై ఇదివరకే ఫిర్యాదు చేసినా కాంట్రాక్టరు స్పందించలేదని ఉపాధ్యాయులు తెలిపారు. ఇస్కాన్ తరపున మధ్యాహ్న భోజనం కాంట్రాక్టు ఉన్నట్లు జేసీకి తెలిపారు. ఉపాధ్యాయులు సైతం నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నట్లు వెల్లడవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేసి, పాఠశాలలో సమస్యలపై విద్యార్థినులతో సమస్యలపై విచారించారు. విద్యార్థినుల విద్యాలక్ష్యాలను విచారించారు. అనంతరం ఏపీఎంజేపీ గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఆయన అక్కడే విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. భోజన సదుపాయాలపై ప్రిన్సిపాల్ సోమశేఖర్‌ను ప్రశంసించారు. అలాగే కలికిరి-1, మర్రికుంటపల్లి గ్రామ సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేసిన జేసీ సిబ్బంది హాజరు, కుల గణన సర్వే పెండింగ్‌పై విచారించి రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. తహసీల్దారు పి.విజయకుమారి, ఎంపీడీఓ రామక్రిష్ణయ్య, ఎంఈఓలు కరీముల్లా, నాగార్జున, ఈఓ గురుమోహన్ తదితరులు ఆయన వెంట పాల్గొన్నారు.

మట్టి గణపతుల తయారీని ప్రోత్సహిద్దాం


పీఓపీ విగ్రహాల నిషేధంపై అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీఓ హరిప్రసాద్

మదనపల్లె : పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలను ప్రోత్సహించి, పీఓపీ విగ్రహాలను నిషేధిద్దామని ఆర్డీఓ హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో మట్టి గణపతుల తయారీ, పీఓపీ విగ్రహాల నిషేధంపై డివిజన్‌లోని రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డ్, ఫైర్, ఎలక్ట్రిసిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోజు రోజుకీ వాతావరణ కాలుష్యం పెరిగిపోతుండటం, భూగర్భజలాలు అడుగంటిపోతుండటం, ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో పర్యావరణాన్ని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వినాయకచవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను ఉపయోగించడం, తయారీ చేయడంను ప్రభుత్వం మూడేళ్ల క్రితమే నిషేధించిందన్నారు. వీటి తయారీని ఎలాగైనా ఆపాలని ప్రయత్నిస్తూనే ఉన్నామన్నారు. ప్రజల సహకారం లేనిదే దీనిని అరికట్టలేమని, పర్యావరణం, భావితరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలన్నారు. జిల్లాలోకి పీఓపీ విగ్రహాలను అనుమతించేది లేదని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో డివిజన్ పరిధిలో తయారీ జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తయారీ కేంద్రాలకు పవర్‌కట్, వాటర్ సప్లై నిలిపివేయాలన్నారు. తయారీదారులకు నోటీసులు ఇచ్చి విగ్రహాలు అమ్మితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించాలన్నారు. మట్టిగణపతులను ప్రోత్సహించేందుకు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎఓ శ్రీనివాసులు, తహసీల్దార్ రమాదేవి, కమిషనర్ ప్రమీల, సీఐలు ఎస్.శేఖర్, వలీబాషు, ఫైర్ ఆఫీసర్ శివయ్య పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలకే అనుమతులివ్వాలి
పెద్దతిప్పసముద్రం : వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాల తయారీ, విక్రయదారులకే అనుమతులు ఇవ్వాలని మదనపల్లి ఆర్డీఓ హరిప్రసాద్ తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. విగ్రహాల తయారీదారులకు ముందస్తుగా నోటీసులు ఇవ్వాలని సూచించారు.

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి బాటలోకి తేవాలి


మండల మీట్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

కలకడ : ప్రజా సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పరిష్కరించి, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి బాటలోకి తీసుకురావాలని ఎంపీపీ శ్రీదేవి కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో శాఖల వారి జరిగిన అభివృద్ధిపై సమీక్ష చేశారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతోందని సభ్యులు తెలియజేశారు. ఏఈ స్పందిస్తూ వర్షాకాలంలో ఈదురు గాలులకు లైన్ ట్రిప్ అవుతోందని, వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని పంచాయతీలలోని నీటి ట్యాంకులను శుభ్రం చేసి పైప్‌లైన్ లీకేజీలులేకుండా చూడాలని ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. సర్పంచ్ విశ్వనాథ మాట్లాడుతూ బాలయ్యగారిపల్లె ఎంపీటీసీ సభ్యురాలి గైర్హాజరు, జగనన్న కాలనీలో అనుమతికి మించి నిర్మాణాలు చేపట్టడంపై విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ రామక్రిష్ణరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌నాయుడు, కలకడ ఎంపీటీసీ సభ్యుడు ముబారక్‌బాష, కో-ఆప్షన్ సభ్యులు ఇనాయతుల్లా, దేవులపల్లె సర్పంచ్ వెంకట్రమణ, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల నిర్మాణ పనులు తనిఖీ

నాణ్యతాప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచన


మెడికల్ కళాశాల నిర్మాణ పనులను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : వందేళ్ల మన్నికతో చేపట్టాల్సిన మెడికల్ కళాశాల నిర్మాణ పనులు నాసిరకంగా ఉన్నాయని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజంపేట పార్లమెంటరీ పరిధిలో మదనపల్లె శానిటోరియం వద్ద నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈ అరవిందాదేవి, మేఘా సంస్థ సిబ్బంది ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానం పలికారు. అనంతరం అధికారులతో కలిసి మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడం, ఇటుకలు, స్టీల్ నాణ్యమైనవి ఉపయోగించకపోవడం, పిల్లర్స్, బీమ్స్ నిర్మాణదశలోనే వంపులు తిరిగి ఉండటం, వాల్ ప్యాచెస్ వేయడం, గోడలు పగుళ్లు రావడంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. వందేళ్ల మన్నికతో చేయాల్సిన పనులు ఇంత అధ్వానంగా చేస్తే ఎలా అంటూ మండిపడ్డారు. పరిశీలనలో తాను గమనించిన లోపభూయిష్టంగా ఉన్న పనులన్నింటినీ ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. అనంతరం మెడికల్ కళాశాల నిర్మాణ పనులపై చీఫ్ ఇంజినీర్ సుధాకరరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. కాంట్రాక్టర్ నిర్మాణంలో నాణ్య తాప్రమాణాలు పాటించడం లేదని, ఈ విధంగా పనులు చేయడం కంటే నిలిపివేయడం మేలన్నారు. దీనిపై ఆయన స్పందిస్తూ క్వాలిటీ కంట్రోల్ టీంను పంపి నాణ్యతను తనిఖీ చేయిస్తామన్నారు. మదనపల్లె నియోజకవర్గానికి తలమానికంగా నిర్మించాల్సిన మెడికల్ కళాశాలలో ఇప్పటికే సగం నాసిరకంగా పూర్తయిందని, మిగిలిన సగమైనా నాణ్యతతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

దోమల నివారణకు చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి


దోమలు వృద్ధి చెందకుండా మెలాథిన్ బాల్స్ వేస్తున్న చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె : ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పట్టణంలో దోమలు వ్యాప్తి చెందకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి తెలిపారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని వార్డుల్లో జరుగుతున్న స్ప్రేయింగ్, డ్రైడే కార్యక్రమాలను చైర్‌పర్సన్ పర్యవేక్షించారు. దోమల నివారణకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్యపనులు, ఫాగింగ్, కాల్వల్లో పూడికలు తీయించడం, మురికి నీటి గుంటల్లో, కాలువల్లో, వంకల్లో మెలాథిన్ బాల్స్ వేయడం, బ్లీచింగ్, చెత్తకుప్పలు తొలగించడం చేస్తున్నామన్నారు. ప్రజలు తమవంతు బాధ్యతగా నీటితొట్టిలు, సంపులను శుభ్రంచేసి వారానికి ఒకసారి డ్రైడే పాటించాలన్నారు. దోమల నివారణకు వేపాకు పొగ పెట్టడంతో పాటు దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ముబీనా, సింధలూరి రజని, నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, నరిబాబాయ్, సలీం పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై గ్రామసభ

రామసముద్రం : మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ గ్రామ సభ శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి పీడీ మద్దిలేటి , డీఓ ప్రసాద్, ఎం.శివప్రసాద్, డీఆర్డీఏ పీడీ సత్యనారాయణ, డీపీఎం.ధర్మరాజు, ఏపీఓ గౌరిశంకర్, ఎంపీపీ కుసుమకుమారి, ఎంపీడీఓ భానుప్రసాద్ హాజరయ్యారు. 2023-2024 సంవత్సరంలో 1620 పనులకు గాను రూ.5.92 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.